


మెగా డీఎస్సీపై మాజీ సీఎం వైఎస్ జగన్ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఈ మెగా డీఎస్సీ నిర్వహించకూడదని వైసీపీ నేతలు ఎన్నో అడ్డంకులు సృష్టించారు. మెగా డీఎస్సీ పోస్టుల భర్తీపై జూన్ 13వ తేదీన తిరుపతి వేదికగా ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా?

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శుక్రవారం 12.06.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 51 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# కొత్త జనాభా విధానానికి శ్రీకారం



## స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలతో దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు

## ఏఐ, క్వాంటం టెక్నాలజీలతో యువతకు భవిష్యత్ నైపుణ్యాలు

## నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని రూపొందించి అమలు చేస్తామని వెల్లడించారు. ఢిల్లీలో గురువారం జరిగిన నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సీఎం.. 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన 'స్వర్ణాంధ్ర ఏ2047' విజన్ ప్రణాళికను సమర్పించారు.
పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, య ం ం వ త నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక ప్రగతి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకమైన విధానాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం వల్ల గత రెండేళ్లలో రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.
రాష్ట్రాల మధ్య పెట్టుబడుల కోసం అనారోగ్యకర పోటీ ఉండకూడదని చంద్రబాబు సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్థిరమైన విధానాలు, సమర్థవంతమైన పాలన ద్వారా మాత్రమే పెట్టుబడులను ఆకర్షించగలమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రిడిక్టివ్ టెక్నాలజీల వినియోగంతో పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు.
ప్రతి కుటుంబానికి ఇల్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ వంటి ఏడు ప్రాథమిక అవసరాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు.
సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా ముందున్న వర్గాలు వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచేలా 'పీ4-పీదీఖ 10-20' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చంద్రబాబు వెల్లడించారు. సమాజంలోని అవకాశాల అసమానతలను తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.
ఆరోగ్య రంగంలోనూ సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. నివారణ వైద్య విధానానికి ప్రాధాన్యం ఇస్తూ డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నామని చెప్పారు. ముందస్తు వ్యాధి గుర్తింపు, మెరుగైన వైద్య సేవల అందుబాటు లక్ష్యంగా ఈ కార్యక్రమం పనిచేస్తుందని వివరించారు.
విద్యా రంగంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్పులు తీసుకువస్తున్నామని చంద్రబాబు అన్నారు. విద్యార్థులకు ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా ఆధునిక నైపుణ్యాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకునేలా యువతను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.
రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తగ్గడం భవిష్యత్‌లో మానవ వనరులపై ప్రభావం చూపే అవకాశం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జనాభా సమతుల్యత, భవిష్యత్ కార్మిక శక్తి అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకురానున్నట్లు తెలిపారు.
వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు.

## రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం



- ఏపీ నుంచి నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవం
- నామినేషన్ల ఉపసంహరణతో ఎన్నిక లాంఛనం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు టీడీపీ, జనసేన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు పూర్తి కావడం, నాలుగు స్థానాలకు నలుగురు అభ్యర్థులే పోటీలో నిలవడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగతా 2లో...

## లిక్కర్ స్కామ్‌లో కీలక అరెస్ట్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మనీలాండరింగ్, హవాలా జరిగినట్లు గుర్తించిన ఈడీ.. విచారణను మరింత వేగవంతం చేసింది. మిగతా 2లో...

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్




- సుమోటోగా కేసు నమోదు • సీఎస్‌కు నోటీసులు జారీ
- భద్రతా లోపాలు, ప్రమాద కారణాలపై రెండు వారాల్లో నివేదిక కోరిన కమిషన్

2లో

## రాజధాని పనులకు మరింత వేగం



- సీఆర్డీఏ త్రీ మెన్ కమిటీ కీలక సమావేశం
- రైతుల సమస్యలు, భూవివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) పరిధిలోని పలు కీలక అంశాలపై త్రీ మెన్ కమిటీ సమావేశం నిర్వహించింది. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అదనపు కమిషనర్లు భార్గవ తేజ, కార్తీక్, గుంటూరు కలెక్టర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.
ఆర్-3 రెసిడెన్షియల్ ఏరియా, 2000 గజాలకు పైగా ఉన్న కమర్షియల్ ప్లాట్లలో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ) పెంపుపై ప్రధానంగా చర్చించారు. దేశంలోని ప్రధాన నగరాల్లో అమలవుతున్న విధానాలను మిగతా 2లో...

## మెగా డీఎస్సీకి ముహూర్తం ఖరారు



- లక్షల మంది అభ్యర్థులకు శుభవార్త
- ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి
- డీఎస్సీ-2025 ఎంపికల్లో పూర్తి పారదర్శకత.. అక్రమాలకు తావులేదు : కోన శశిధర్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరోసారి శుభవార్త అందించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా అక్టోబర్ నెలలో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ నెలలో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిఎస్సీ-2025 నియామకాలపై మరొక సారి సమగ్ర వివరణ ఇచ్చారు. డీఎస్సీ-2025 నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలుపై కొంత మంది అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.
**2024లో నోటిఫై చేసిన పోస్టులను భర్తీ చేయకపోవడానికి కారణం....:** 2024లో నోటిఫై చేసిన సుమారు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమలులో పూర్తి చట్టబద్ధత, స్పష్టత, నిబంధనల అనుసరణను నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడటంతో పాటు, టెట్--డీఎస్సీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ రెండు అంశాల నేపథ్యంలో నియామక ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సి రావడంతో మిగతా 2లో...

## మాది ప్రజా పాలన.. జగన్‌ది వెన్నుపోటు రాజకీయాలు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మండిపాటు



**పెనుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రాజకీయాలు చేస్తున్న జగన్‌ది వెన్నుపోటు ధోరణి అని విమర్శించారు. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో మిగతా 2లో...

## ప్రజల విశ్వాసం.. అభివృద్ధి ఫలితం.. రెండేళ్ల అచ్చెన్న పాలనకు ప్రశంసలు

- రెండేళ్ల ప్రగతి ప్రస్థానం..గత పాలకులకు చెంప పెట్టు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకుడు, మంత్రి నారా లోకేష సహకారంతో అభివృద్ధి
- వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చిన మంచి మనిషి
- వ్యవసాయానికి పెద్దపీట.. అభివృద్ధికి కొత్త బాట.. అచ్చెన్న రెండేళ్ల పాలన ప్రత్యేకత
- టెక్కలి నియోజకవర్గంలో వందల కోట్ల పనులకు ఆద్యుడు

3లో

## విద్యతోనే పేదల సాధికారత




- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాల్లో విద్యా బోధన, సౌకర్యాలు
- 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి
- విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ : మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్య ద్వారా పేదలు సాధికారత సాధించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం విజయవాడలోని వి.ఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో అంబేద్కర్ గురుకులాల డీసీవోలు, ప్రిన్సిపాళ్లు, మిగతా 2లో...

## మోదీ 12 ఏళ్ల పాలన విజయాలే అజెండా



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్

### రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారానికి బీజేపీ సిద్ధం

### దేశాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ కీలక నిర్ణయాలపై ప్రజలకు వివరణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో దేశ అభివృద్ధికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ అన్నారు. అమరావతిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ పనితీరును వివరించారు.
బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సూచనల మేరకు మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల విజయాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పీవీయన్ మాధవ్ తెలిపారు. 2014లో ప్రజల విశ్వాసంతో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిందని, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవంతో దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని చెప్పారు.
డా. బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం కారణంగానే సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి దేశ అత్యున్నత పదవికి చేరుకునే అవకాశం లభించిందని అన్నారు. మోదీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో దారిద్ర్య రేఖ దిగువన ఉన్న ప్రజల శాతం 33.8 నుంచి 11 శాతానికి తగ్గిందని తెలిపారు. అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వ పథకాలు చివరి వ్యక్తికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
గత 12 ఏళ్లలో అవినీతి ఆరోపణలకు తావులేకుండా మోదీ ప్రభుత్వం దేశ సేవలో ముందుకు సాగిందని పీవీయన్ మాధవ్ అన్నారు. విదేశాంగ విధానంలో భారత్ ప్రతిష్ఠను పెంచడంతో పాటు ప్రపంచ ఆర్థిక శక్తుల్లో ఒకటిగా ఎదిగేలా చర్యలు చేపట్టిందన్నారు. దేశ భద్రతను బలోపేతం చేసి ఉగ్రవాదం, నక్సలిజం ప్రభావాన్ని తగ్గించడంలో కేంద్రం కీలకంగా వ్యవహరించిందని చెప్పారు.
మౌలిక వసతుల రంగంలో భారీగా అభివృద్ధి జరిగిందని, మిగతా 2లో...

# మెగా డీఎస్సీకి ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

పోస్టుల భర్తీ ఆలస్యమైనట్లు ఆయన స్పష్టం చేశారు.

**డిఎస్సీ ప్రక్రియలో పేపర్ లీకేజీకి అవకాశమే లేదు :** డిఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడిందని కోన శశిధర్ తెలిపారు. సిస్టమ్‌కు పరిమిత సంఖ్యలో మాత్రమే అధికారిక యాక్సెస్ ఉంటుందని, కేవలం ఇద్దరు నియమిత శాశ్వత ఉద్యోగులు మాత్రమే డేటా అప్‌లోడ్ చేసే అధికారం కలిగి ఉంటారని తెలిపారు. పాస్‌వర్డులు నిరంతరం మార్చబడుతూ ఉంటాయని, అనధికార ప్రవేశానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. అందువల్ల డేటా లీకేజీ లేదా పేపర్ లీకేజీకి ఎటువంటి అవకాశం ఉందన్నారు.

**మెరిట్ లిస్ట్ తయారీ పూర్తిగా నిబంధనల ప్రకారం :** డిఎస్సీ ఎంపికల్లో టెట్ మార్కులకు 20 శాతం, డిఎస్సీ మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి జనరల్ మెరిట్ లిస్ట్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. టెట్ మార్కులను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్ రావడం అంటే అభ్యర్థి ఎంపికైనట్లుగా కాదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్లు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ తదితర అంశాల ఆధారంగా తుది ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చినప్పటికీ, వెరిఫికేషన్ సమయంలో అనర్హత తేలితే తదుపరి అభ్యర్థికి అవకాశం దక్కవచ్చని వివరించారు.

**గ్రీవెన్స్ పరిష్కారానికి మూడు స్థాయిల వ్యవస్థ :** అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారం కోసం ప్రభుత్వం మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ మెకానిజాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలన, రాష్ట్ర స్థాయి కమిటీ, కమిషనర్ స్థాయి తుది పరిశీలనతో అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారించడం జరుగుచున్నదన్నారు. ఈ ప్రక్రియ ద్వారా




ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలపై పూర్తి వివరణ :** స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనలు, జీఓల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో ఎంపికలు నిర్వహించినట్లు రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ స్పష్టం చేశారు.

**ఇంటర్-కాలేజియేట్ పోటీలకు ప్రస్తుత నియామకాల్లో ప్రాధాన్యం లేదు :** ప్రస్తుతం అమల్లో ఉన్న జీఓ ఎంఎస్ నెం. 4 ప్రకారం ఇంటర్-కాలేజియేట్ పోటీల్లో పాల్గొనడం లేదా సాధించిన విజయాలను ఉద్యోగాల కోసం అర్హతగా పరిగణించలేదని ఆయన తెలిపారు. అయితే 2012 ఆగస్టు 9న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం. 74 ప్రకారం నిర్వహించిన గత నియామకాలలో ఇంటర్-కాలేజియేట్ పోటీలు, ఇంటర్-డిస్ట్రిక్ట్ పోటీలు, రూరల్ స్పోర్ట్స్, మహిళా క్రీడా ఉత్సవాలు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు వంటి విభాగాల్లో పాల్గొనడం లేదా పతకాలు సాధించడం కూడా ఉద్యోగ అర్హతకు పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు. అదే విధానం 2019లో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సుమారు 1.20 లక్షల నియామకాలలో కూడా అమలులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**జీఓ-4 ప్రకారం అత్యున్నత క్రీడా విజయాలకే ప్రాధాన్యం :** ప్రస్తుత నియామకాల్లో జాతీయ క్రీడలు, జాతీయ ఛాంపియన్‌షిప్‌లు, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలు, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు, రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లు, అంతర్జాతీయ స్థాయి పోటీలలో సాధించిన విజయాల ఆధారంగా మాత్రమే ప్రాధాన్యత కేటాయించినట్లు ఆయన తెలిపారు.

**382 మంది స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉన్నాయి :** డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా కింద మొత్తం 382 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో భాగమయ్యారని ఆయన తెలిపారు. వీరిలో 22 మంది బంగారు పతక విజేతలు, 40 మంది రజత పతక విజేతలు, 43 మంది కాంస్య పతక విజేతలు మరియు 275 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. ఖో-ఖో, బాల్ బ్యాడ్మింటన్, జూడో, సాఫ్ట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ తదితర 34 క్రీడా విభాగాలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో భాగమయ్యారని ఆయన తెలిపారు.

**ప్రతి సర్టిఫికేట్‌పై బహుస్థాయి ధృవీకరణ :** సమర్పించిన ప్రతి క్రీడా సర్టిఫికేట్‌ను స్క్రూటినీ కమిటీ, రాష్ట్ర స్థాయి కమిటీ, సంబంధిత క్రీడా సంఘాలు, యూనివర్సిటీలు మరియు ఇతర అధికారిక రికార్డుల ద్వారా పరిశీలించి మాత్రమే అర్హత నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 1996 నుంచి 2025 వరకు జారీ చేసిన సర్టిఫికెట్లను కూడా ధృవీకరణలో భాగంగా పరిశీలించినట్లు వెల్లడించారు.

**దుర్గయ్య కేసుపై వివరణ :** తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థి అనిగి దుర్గయ్య తనకు జాతీయ క్రీడల్లో సాధించిన విజయాలున్నప్పటికీ ఉద్యోగం రాలేదని చేసిన ఆరోపణలపై ఆయన వివరణ ఇస్తూ దుర్గయ్య 32వ నేషనల్ గేమ్స్ కు సంబంధించిన సర్టిఫికేట్‌ను ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్లోడ్ చేయలేదని, భౌతిక ధృవీకరణ సమయంలో మాత్రమే ఆ వివరాలను సమర్పించినట్లు తెలిపారు. అయితే జీఓ-4 మరియు నోటిఫికేషన్ ప్రకారం నిర్దేశిత గడువులో ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టమైన నిబంధన ఉన్నందున, అనంతరం సమర్పించిన పత్రాలను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యపడలేదని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థి ఆన్‌లైన్‌లో సరైన సర్టిఫికేట్‌ను సమర్పించి ఉంటే, అతని అర్హతను సంబంధిత ప్రాధాన్యత క్రమంలో పరిశీలించే అవకాశం ఉండేదని వివరించారు.

**గత నియామకాలు - ప్రస్తుత నియామకాల మధ్య తేడా :** 2019 గ్రామ/వార్డు సచివాలయ నియామకాలలో ఇంటర్-కాలేజియేట్, రూరల్ స్పోర్ట్స్, ఇంటర్-డిస్ట్రిక్ట్ పార్టిసిపేషన్ వంటి కేటగిరీలను పరిగణనలోకి తీసుకుని వందలాది మందికి ఉద్యోగాలు కల్పించినప్పటికీ, ప్రస్తుత డీఎస్సీ నియామకాల్లో అమలులో ఉన్న జీఓ-4 ప్రకారం అలాంటి కేటగిరీలు పరిగణనలో లేవని ఆయన స్పష్టం చేశారు.

**క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం :** స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల కల్పన వెనుక ప్రధాన ఉద్దేశ్యం రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశాలు కల్పించడమేనని శాప్ వైస్ చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ భరణి తెలిపారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మరింత మంది యువత క్రీడల వైపు ఆకర్షితులవుతారని ఆమె పేర్కొన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర విద్యా శాఖ కమినషర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

## రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం



(మొదటి పేజీ తరువాయి)

టీటీపీ నుంచి సానా సతీశ్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పోటీలో నిలవగా.. జనసేన నుంచి లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. అయితే, పోటీలో నలుగురు అభ్యర్థులే ఉండడంతో వారి ఎన్నిక ఖరారైంది. ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు జూన్ 1న భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం జూన్ 18న మట్టుత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అలాగే పదవీకాలం ముగియకుండానే ఖాళీ అయిన మరో మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఈసీ తెలిపింది. ఈనెల 9న నామినేషన్ల పరిశీలన.. 11వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చింది. జూన్ 20 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో 9 మంది చనిపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై చలించిపోయిన ప్రభుత్వం బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. అయితే ఈ ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్ అయింది. సుమోటోగా కేసు నమోదు చేసింది. రాష్ట్ర సీఎస్ జి. సాయి ప్రసాద్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రమాదానికి గల కారణాలు, భద్రతా లోపాలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు పరిహారానికి సంబంధించిన చెల్లింపుల వివరాలను సమర్పించాలని పేర్కొంది. అదే విధంగా క్షతగాత్రులపై పరిస్థితిపైనా ఎన్‌హెచ్‌ఆర్సీ ఆరా తీసింది.

## విధ్వంసం నుంచి వికాసం వైపు




**అమరావతి(జర్నలిస్ట్ పైల్) :** గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జరిగిన నష్టాలను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మహాన్యూస్ కాన్‌క్లేవ్-2026 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడం, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం వంటి అంశాలను ప్రజలు విధ్వంసంగా భావించారని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతోందని చెప్పారు. పరిశ్రమలు, పెట్టుబడులు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

రెండేళ్లలో రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులను క్షేత్రస్థాయిలో అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, సాగునీరు, మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

వైసీపీ అధినేత జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని మంత్రి విమర్శించారు. మద్య నిషేధం, సంక్షేమ హామీలు, ఆరోగ్యశ్రీ వంటి అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రతిపక్షహోదా ప్రజలు నిర్ణయించాల్సిన అంశమని, అసెంబ్లీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని అన్నారు.

జగన్ చేస్తున్న రాజకీయాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలుగా మంత్రి అభివర్ణించారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధంగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

గృహనిర్మాణంపై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4.50 లక్షల ఇళ్లను ప్రజలకు అందించామని తెలిపారు. మరో 4 లక్షల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు అందించామని, హెల్త్ ఇన్సూరెన్స్ కొనసాగించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం లభిస్తోందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. భవిష్యత్ తరాల కోసం పెట్టుబడులు, ఉద్యోగాలు, రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు.

## విద్యా క్యాలెండర్ విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ పైల్) :** విద్యాశాఖ ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏపీలో వేసవి సెలవులు ముగిశాయి. నేటి నుంచి స్కూళ్లు తిరిగి ప్రారంభం కాబతున్నారు. ఈ నేపథ్యంలోనే 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన సమగ్ర వార్షిక ప్రణాళికను ఏపీ విద్యాశాఖ అధికారికంగా విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు మొత్తం 229 పనిదినాలు (ఔశీతీనిఅఅస్త్ర ఋఎం) ఉండనున్నాయి. ఇక ఆదివారాలు, ప్రభుత్వ, పండుగ హాలిడేస్ కలుపుకుని మొత్తం 87 రోజులను సెలవులుగా విద్యాశాఖ ప్రకటించింది. దసరా సెలవులు అక్టోబర్ 12 నుంచి అక్టోబర్ 21 వరకు, క్రిస్మస్ సెలవులు డిసెంబర్ 20 నుంచి డిసెంబర్ 27, 2026 వరకు, ఇక సంక్రాంతి సెలవులు జనవరి 11 నుంచి జనవరి 17, 2027 వరకు నిర్ణయించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు, పుస్తకాల భారాన్ని తగ్గించేందుకు విద్యాశాఖ ఈ ఏడాది కూడా కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రతి శనివారం పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే'గా ఉంటుంది. ఆ రోజు విద్యార్థులు పుస్తకాల బ్యాగ్‌లు లేకుండా స్కూలుకు హాజరై వినూత్న కృత్యాలు, ఆటపాటలు, క్విజ్, ఇతర నైపుణ్యాల సాధనలో పాల్గొంటారు.

# రాజధాని పనులకు మరింత వేగం

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలిస్తూ ఎఫ్ఎస్ఐపై సీఆర్డీఏ కమిషనర్ కమిటీకి వివరించారు. రోడ్డు వెడల్పు, పార్కింగ్ జోన్లను దృష్టిలో ఉంచుకుని ఎఫ్ఎస్ఐ పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఎఫ్ఎస్ఐ మంజూరు విషయంలో భూములు ఇచ్చిన రైతుల అభిప్రాయాలు, సందేహాలను తెలుసుకునేందుకు వచ్చే గురువారం వారితో సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ విజయరామరాజు తెలిపారు. గ్రామకంఠాల్లో 10 సెంట్ల లోపు భూసేకరణకు సంబంధించిన అంశాలపై గుంటూరు జాయింట్ కలెక్టర్ విచారణ పూర్తి చేసి పది రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తారని చెప్పారు.

ఎన్ఎస్పీ పరిధిలో భూములు కోల్పోతున్న యజమానులకు తాత్కాలికంగా ఇంటి అద్దె కింద ఏడాది పాటు నెలకు రూ. 10 వేల చొప్పున చెల్లించాలని కమిటీ నిర్ణయించింది. ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూముల్లో లేఅవుట్లు పూర్తయిన తర్వాత మూడు నెలల్లోపు అక్కడికి మారేందుకు సమయం ఇవ్వాలని నిర్ణయించారు.

తుళ్లూరు ప్రాంతంలో నిర్మాణమవుతున్న రహదారి కారణంగా గ్రామం రెండు భాగాలుగా విడిపోయే



పరిస్థితి నేపథ్యంలో ప్రజల రాకపోకలకు అనువుగా కనెక్టివిటీ కల్పించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కోరారు. దీనిపై ప్రణాళిక రూపొందిస్తున్నామని అదనపు కమిషనర్ భార్గవ తేజ వివరించారు.

తుళ్లూరులో ఆర్ అండ్ బీ రోడ్డు వెంట ఉన్న నిర్మాణాలను కమర్షియల్‌గా ప్రకటించాలన్న వినతిపై ప్రస్తుతం ఆ ప్రాంతం ఆర్-1 జోన్‌లో ఉన్నందున నిబంధనల ప్రకారం పరిశీలించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

తాడికొండలో రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం, టిడీఆర్ బాండ్ల జారీ అంశంపై కూడా చర్చ జరిగింది. గతంలో ఫిబ్రవరిలోనే పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుర్తుచేశారు. సాధ్యమైనంత త్వరగా పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

నూతనంగా భూములు ఇస్తున్న రైతులకు సంబంధించి 9.14బి ఫారంలో అవసరమైన మార్పులు చేయాల్సిన అంశంపై క్యాబినెట్‌లో చర్చించాల్సి ఉందని సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు. రైతులకు వీలైనంత వరకు వారి గ్రామాల పరిధిలోనే ప్లాట్ల కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వార్షిక కౌలు, కాలపరిమితులు, వీధి ప్లాట్లకు సంబంధించిన ప్లగ్ఇన్ అంశాలపై త్వరలో స్పష్టత ఇస్తామని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మార్పులకు అవకాశం లేకుండా ప్రభుత్వం నుంచి జీవో జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి త్రీ మెన్ కమిటీ మరో రెండు వారాల తర్వాత తిరిగి సమావేశం కావాలని నిర్ణయించింది.

# మోదీ 12 ఏళ్ల పాలన విజయాలే అజెండా




(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 1.75 లక్షల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించామని తెలిపారు. రోజుకు రహదారి నిర్మాణ వేగం గణనీయంగా పెరిగిందన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ మెడికల్ డివైస్ పార్కులు, కొత్త పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు.

జీ-20 సదస్సును విజయవంతంగా నిర్వహించడం, జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తింపు పొందేలా చేయడం మోదీ నాయకత్వ విజయాల్లో భాగమని అన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

భారత సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు కూడా కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, కాశీ, కేదార్‌నాథ్, సోమనాథ్ వంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధి చారిత్రక ఘట్టాలని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని పీవీయన్ మాధవ్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి సుమారు రూ. 30 వేల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. క్వాంటమ్ సెంటర్, గూగుల్ ఏఐ క్లౌడ్ డేటా సెంటర్లు, సెమీకండక్టర్ రంగ పెట్టుబడులు వంటి ప్రాజెక్టులు రాష్ట్రానికి రావడం అభివృద్ధికి ఊతమిస్తాయని చెప్పారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రమాదాల్లో మరణించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు తిరుపతిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పీవీయన్ మాధవ్ వెల్లడించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్, రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక, షేక్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# లిక్కర్ స్కామ్‌లో కీలక అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌తో పాటు పది చోట్ల ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాజ్ కసిరెడ్డి నివాసం, కార్యాలయాలతో పాటు మరికొందరు అనుమానితుల ఇళ్లల్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డిని ఈడీ అదుపులోకి తీసుకుంది. లిక్కర్ స్కామ్, మద్యం రవాణా కేసుల్లో రాజ్ కసిరెడ్డిని ఈడీ ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఈ కేసులో పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఉందని ఈడీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ కేసులో ఇప్పటికే విజయవాడలోని సిట్ నాలుగు ఛార్జ్‌షీట్‌లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఫైనల్ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

**జగన్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు..:** లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిస్తోంది. లిక్కర్ స్కామ్‌లో జగన్ అండ్ గ్యాంగ్ వేల కోట్లు కొట్టేసినట్లు తెలుస్తోంది. జే బ్రాండ్స్ విషంతో ప్రజల ప్రాణాలను జగన్ బలి తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లిక్కర్ స్కామ్‌లో అన్ని వేళ్లు తాడేపల్లి ప్యాలెస్ వైపు చూపిస్తుండటంతో.. త్వరలోనే జగన్‌కు కూడా ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## విద్యతోనే పేదల సాధికారత



(మొదటి పేజీ తరువాయి)

సోషల్ వెల్ఫేర్ డీడీలు, ఏఎస్ డబ్ల్యూవో లకు నిర్వహించిన వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా మంత్రి డా. స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...విద్య ద్వారా పేదలు సాధికారత సాధించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు విద్యా బోధనా, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు, సిబ్బంది పని చేయాలి. 100 డేస్ యాక్షన్ ప్లాన్, ముస్తాబు కార్యక్రమం ప్రతి పాఠశాలలో కచ్చితంగా అమలు చేయాలి. మరుగుదొడ్లు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి, పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక ఉపాధ్యాయులు, సిబ్బంది శ్రద్ధ పెట్టాలి, విద్యార్థుల మానసిక స్థితి గమనించి కౌన్సిలింగ్ ఇవ్వాలి. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి తగిన విధంగా శిక్షణ ఇవ్వాలి. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు బోధించడంతో పాటు వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలి. ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10 కి పెంచాం. ఈ ఏడాది మరో 3 ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం. ఐఐటి, నీట్ లో ఎక్కువ మంది విద్యార్థులు సీట్లు సాధించేలా కృషి చేయాలి. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, మెకనైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేశాం. ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌లో పారిశుద్ధ్యం, సౌకర్యాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో 100 శాతం సంతృప్తి రావాలి. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, పేదల విద్య కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా భరిస్తుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో డా. బి. ఆర్ అంబేద్కర్ గురుకులాల సంస్థ కార్యదర్శి ఐఏఎస్ వి. ప్రసన్న వెంకటేష్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఐఏఎస్ బి. లావణ్య వేణి, అడిషనల్ డైరెక్టర్ సునీల్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాది ప్రజా పాలన.. జగన్‌ది వెన్నుపోటు రాజకీయాలు



(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.

అమరావతి, పోలవరం, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన వంటి అంశాల్లో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేశారని విమర్శించారు.

రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్, పారిశ్రామిక, డ్రోన్ హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కరవు ప్రాంతంగా ఉన్న సీమకు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తున్నామని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూముల విషయంలో జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించిన మంత్రి, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.



# ప్రజల విశ్వాసం.. అభివృద్ధి ఫలితం..



# రెండేళ్ల అచ్చెన్న పాలనకు ప్రశంసలు

- రెండేళ్ల ప్రగతి ప్రస్థానం.. గత పాలకులకు చెంప పెట్టు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకుడు, మంత్రి నారా లోకేష సహకారంతో అభివృద్ధి
- వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చిన మంచి మనిషి
- వ్యవసాయానికి పెద్దపీట.. అభివృద్ధికి కొత్త బాట.. అచ్చెన్న రెండేళ్ల పాలన ప్రత్యేకత
- టెక్కలి నియోజకవర్గంలో వందల కోట్ల పనులకు ఆద్యుడు











**నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్) :** టెక్కలి నియోజకవర్గం : గతం కన్నా భిన్నంగా ఉంటే అది ఒక కొత్త చరిత్రకు కారణం అవుతుంది. కొత్త ఆలోచనకు నాంది అవుతుంది. రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి, వికాసం అన్నవి రెండు కళ్లుగా ఉన్నాయి. వికాసం అంటే చదువుకు సంబంధించి అని అర్థం. అభివృద్ధి అంటే సామాజిక అభివృద్ధితో పాటే ప్రభుత్వ ఆస్తుల విస్తరణ వాటి వినియోగం, వాటిలో చేయాల్సిన మార్పులు, కొత్త భవనాల కూర్పు అన్నవి ఎంతో బాగున్నాయి అని కింజరాపు అభిమానులే కాదు నియోజకవర్గ ప్రజలు సైతం చెబుతున్నారు.

**గ్రామీణ రహదారులు రహదారుల అభివృద్ధే ధ్యేయం :** ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు ప్రధానం అయిన విషయంగా అజెండాగా తీసుకుని మారుమూల ప్రాంతాలను సైతం కలిపే విధంగా రోడ్లు వేయడం ఓ మంచి ప్రయత్నం శుభ పరిణామం. ముఖ్యంగా రహదారుల కోసం ముఖ్య రహదారుల కోసం కోటబొమ్మాళి, టెక్కలి, సంతబొమ్మాళిలో నిధులు వెచ్చించారు. 700 రూ. వందల కోట్ల రూపాయల నిధుల వెచ్చింపులో భాగంగా ప్రధాన రహదారుల విస్తరణకు శ్రీకారందిద్దారు. అలానే రెండు కోట్ల రూపాయలు వెచ్చించి కోటబొమ్మాళి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్ ఫార్మర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించి ఆ రోజు సంబంధిత ప్రక్రియకు ప్రాణం పోశారు. కోటబొమ్మాళిలో చీపుర్లపాడు వద్ద పది కోట్ల రూపాయలతో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. సంతబోమ్మాళి, టెక్కలి మండలం ఎత్తిపోతల పథకానికి సంబంధించి దృష్టి సారించారు. రూ, 7, కోట్ల 88 లక్షల రూపాయలతో కొండపేట, మదన గోపాల సాగరం వద్ద ఎత్తి పోతల పథకం పునరుద్ధణకు నిధులు మంజూరుచేశారు.

**పేదలకు అన్నం పడుతున్న అన్నా క్యాంటీన్లు :** కోటబొమ్మాళి టెక్కలిలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టెక్కలి నియోజకవర్గంలో రెండు అన్నా క్యాంటీన్లకు శ్రీకారం దిద్దారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి హయాంలో వారి నిర్దేశకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు అయిన ఈ పథకంతో ఐదు రూపాయలకే పేదలకు పట్టెడన్నం నాణ్యమయిన భోజనం, మూడు పూటలా ఆహారం అందేవిధంగా ఏర్పాటు చేయడం ఓ గొప్ప పరిణామం. అధినేత స్ఫూర్తి అందుకుని తన వంతుగా అచ్చెన్న నియోజకవర్గంలో రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేయడం, వీటితో పాటే నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం మంచి పరిణామాలకు సంకేతం. అన్నా క్యాంటీన్ల ఏర్పాటు నిమిత్తం ఆయన ఎంతో కృషి చేసి నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల, ప్రజల మన్ననలు అందుకున్నారు.

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకుడు, మంత్రి నారా లోకేష సహకారంతో అభివృద్ధి :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతోంది. ముగ్గురు అగ్రనేతల ఆశీస్సులు, ప్రజల సహకారంతో అభివృద్ధి ప్రస్థానం మరింత వేగంగా కొనసాగనుంది.

**పేదలకు ఆదుకున్న సీఎంఆర్ఎఫ్ :** టెక్కలి నియోజకవర్గ ప్రజలు ఎవ్వరైనా సరే ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్థిస్తే చాలు సాయం అందించాలి అన్న సంకల్పంతో గౌరవ మంత్రివర్యులు అచ్చెన్న పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ 370 మంది బాధితులకు మూడు కోట్ల 36 లక్షల రూపాయల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎవ్వరైనా సాయం కావాలంటే 24 గంటలూ అందుబాటులో ఉండేవిధంగా కార్యాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచి వారితో పనిచేయిస్తున్నారు. దీర్ఘ కాలిక వ్యాధులతో సతమతం అవుతూ, వివిధ రోడ్డు ప్రమాదాల కారణంగా మంచం పట్టి ఖరీదయిన ఆధునిక వైద్యం అందక అవస్థ పడే వారికి అండగా.. ఒక పెద్దన్నయ్యగా ఆయన నిలుస్తున్నారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ముఖ్యంగా బాధితుల విషయమై మానవతా దృక్పథంతో పనిచేయాలని పదే పదే తన అధికారులకు సూచిస్తున్నారు.

**విద్యార్థులకు వరం కోటబొమ్మాళి డిగ్రీ కళాశాల :** ఇక్కడి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా నిలుస్తోంది కోటబొమ్మాళి డిగ్రీ కళాశాల. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైతే, దానిని వైసీపీ పాలకులు స్వార్థ రాజకీయాల కారణంగా రద్దు చేశారు. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ప్రక్రియను ప్రారంభించి, కోటబొమ్మాళి కి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేసి సఫలీకృతం అయ్యారు. దీంతో ఆ రోజు ఎన్నికల హామీని నిలబెట్టుకున్నవారయ్యారు. అలానే ప్రభుత్వ విద్య అందరికీ అందాలి.. ప్రభుత్వ విద్య బలోపేతం కావాలి అన్న నినాదంతో నియోజకవర్గంలో ఉన్న అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ ఉన్నారు. ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం తీసుకుని వస్తున్నారు.

తల్లికి వందనంలో భాగంగా లబ్ధిదారులైన వారంతా ఇవాళ ఎంతో ఆనందంగా ఉన్నారు. అర్హులెవ్వరినీ విస్మరించవద్దని అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ ఉన్నారు. పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించి, చిన్నారులను కలిసి వారితో మమేకం అయి, భోజన నాణ్యతపై వివరాలు తెలుసుకుంటున్నారు. ఆయనే వారితో కలిసి భోజనం చేసి, మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ తీరుపై చిన్నారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ లక్ష్యాలను అధికారులకు పదే పదే వివరిస్తూ ఉన్నారు.

**నిరంతర పర్యవేక్షణ..ప్రాజెక్టుల పరిరక్షణ :** ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించే పథకం విషయమై ఎంతో శ్రద్ధ వహించి రూ,650 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. అలానే సాగు, తాగు నీరు విషయమై.. మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెబుతూ, ఎప్పటికప్పుడు ముఖ్యంగా వంశధార లాంటి కీలక ప్రాజెక్టుల నిర్వహణ పై దృష్టి నిలుపుతున్నారు. అలానే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ రహదారుల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అలానే కోటబొమ్మాళిలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి 80 లక్షల రూపాయలు మంజూరు చేశారు. కొత్త ట్రెజరీ భవనం ప్రారంభించారు.

**వైద్యారోగ్యానికి పెద్ద పీట:** టెక్కలిలో రూ, 15 కోట్ల రూపాయలతో 50 బెడ్లు ఆయుష్ ఆస్పత్రికి నిధులు మంజూరు చేశారు. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తైతే ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

అలానే టెక్కలి కేంద్రంగా ఉన్న జిల్లా ఆస్పత్రిపై కూడా నిరంతరం దృష్టి సారిస్తూ సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తూ, సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

**మార్కెట్ యార్డుకు నిధులు :** కోటబొమ్మాళి మండలం, చీపుర్లపాడు వద్ద నూతన మార్కెట్ యార్డు మంజూరుకు కృషి చేశారు. ఇందులో భాగంగా నాలుగు అభివృద్ధి పనుల కోసం రూ,3.20 కోట్ల ఇరవై లక్షల రూపాయలు కేటాయించారు. దీంతో ఇక్కడ ప్రజల మన్ననలు అందుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపాదనల దశలోనే ఉన్న పనులకు సైతం నిధులు తీసుకుని వచ్చి విపక్షాల నోరు మూయిస్తున్న ఘనత అచ్చెన్నదే కావడం విశేషం.

**ఆధ్యాత్మిక విస్తృతిలో భాగంగా :** టెంపుల్ టూరిజంకు ప్రాధాన్యం ఇస్తూ.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయానికి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. అలానే ఇక్కడి పండుగలను ప్రభుత్వ పండుగలుగా అధికారికంగా గుర్తింపు వచ్చేలా కృషి చేసి, టెంపుల్ టూరిజంకు ప్రాధాన్యం ఇస్తూ.. ఎన్నడూ లేని విధంగా స్థానిక సంప్రదాయాలకు పట్టం కట్టిన వైనం శుభ పరిణామం. నిన్నమొన్నటి వేళ కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి.

**విపక్ష శ్రేణులను సైతం విస్మయపరుస్తూ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరుసగా రెండోసారి అధికారికంగా కలెక్టర్ నేతృత్వాన, అచ్చెన్న సారథ్యాన, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమన్వయాన ఎంతో వైభవంగా ఈ ఉత్సవాలు జరిగాయి. ఎక్కడా ఏ లోటూ లేకుండా జన జాతర సాగింది. అలానే మరో ఆధ్యాత్మిక క్షేత్రం ఎండల మల్లికార్జుని ఆలయానికి మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం దిద్దారు. టెక్కలి పట్టుమహాదేవి కోనేరును రెండు విడతల్లో అభివృద్ధి చేయాలన్న తలంపులో భాగంగా, సంకల్పంలో భాగంగా 12 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రభుత్వ సంబంధ పరిపాలన అనుమతులు సైతం తీసుకుని వచ్చి ఈ..ప్రాంత అభివృద్ధికి తానెంత ప్రాధాన్యం ఇస్తున్నానో అన్న విషయం నిరూపించారు. మాటల్లో కాకుండా..చేతలలో..నిరూపించి విపక్ష శ్రేణులను విస్మయ పరిచారు. అందరి ప్రశంసలూ అందుకున్నారు. రెండేళ్ల పాలనలో అటు పార్టీ శ్రేణులనూ ఇటు ప్రజలనూ సమన్వయ పరిచి కొత్త ప్రగతి అందుకున్నారు. వివాద రహితులుగా ఉంటూ, కూటమి పెద్ద చంద్రబాబు సంకల్పానికి నిదర్శనం అయి నిలిచారు.



**ఫైళ్ల పరిష్కారంలో వేగం... పెండింగ్ క్లియరెన్స్‌లో రాష్ట్రంలోనే అగ్రస్థానం :** టెక్కలి నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నారు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారిని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ప్రజలు అందజేసే వినతిపత్రాలను స్వయంగా పరిశీలించి, సాధ్యమైనంత మేరకు తక్షణ పరిష్కారం లభించేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, పరిపాలనలో కనబరుస్తున్న సమర్థతకు విశేష ప్రశంసలు లభిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం మంత్రి అచ్చెన్నాయుడు పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ఫైళ్ల పరిష్కారంలో వేగం, పెండింగ్ అంశాల క్లియరెన్స్‌లో సమర్థ నిర్వహణతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచారు. ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంక్షేమ పథకాల పర్యవేక్షణలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజానాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు మంత్రి అచ్చెన్నాయుడు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, “సేవే ధ్యేయం -- ప్రజలే బలం” అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తున్నారు.





## ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు వైద్యుల సంఘం వినతి**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి తగిన సహకారం అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి. జయధీర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన వివరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ డి. జయధీర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు వైద్యుల సమస్యలను పరిష్కరించడం అవసరమని అన్నారు. వైద్యులపై ఉన్న పనిభారం, సేవల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, వృత్తిపరమైన సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించేలా బీజేపీ తరపున సహకారం అందించాలని కోరారు.

పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ వైద్యుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత స్థాయిలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల మెరుగుదల, వైద్య సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. వైద్యుల సంఘం ప్రతినిధులు అందించిన అంశాలను పరిశీలించి అవసరమైన సహకారం అందిస్తామని పీవీఎన్ మాధవ్ హామీ ఇచ్చారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- **కేంద్ర మంత్రిని, ఎన్‌సీటీఈ చైర్మన్‌ను కలిసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు**



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య, అఖిల ఢిల్లీ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీని కలిసి వినతిపత్రం అందజేశారు.

అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు బసవరాజు గురకర్ అధ్యక్షతన వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేంద్ర మంత్రిని కలిశారు. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రులతో చర్చించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ప్రహ్లాద్ జోషీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

అనంతరం ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎన్‌సీటీఈ కార్యాలయానికి వెళ్లి చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యా హక్కు చట్టం అమలుకు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రితో పాటు ఇతర కేంద్ర మంత్రులను కలిసి ఇదే అంశంపై వినతులు అందజేస్తామని అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏజీఎస్ గణపతిరావు తెలిపారు.

పార్లమెంట్ సమావేశాలకు ముందు ఎంపీలను కలిసి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు బసవరాజు గురకర్ తెలిపారు.

## 24 నుంచి రొట్టెల పండుగ..



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని బారా షహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. రొట్టెల పండుగ సందర్భంగా ఏర్పాట్లపై గురువారం నెల్లూరులో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు బారా షహీద్ దర్గాలో రొట్టెల పండగ జరుగుతుందన్నారు.

ఈ ఏడాది ఈ పండగకు దేశ విదేశాల నుంచి 16 లక్షల నుంచి 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా ఈ రొట్టెల పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. బారా షహీద్ దర్గాకు 415 సంవత్సరాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. రొట్టెలు పట్టుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారని చెప్పారు. అందుకే ప్రతీ ఏడాది భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతోందన్నారు.

భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై చర్చించారు. అలాగే సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24వ తేదీ లోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 18,19 తేదీల్లో ఢిల్లీలో పాస్ పోర్టు అధికారుల సమావేశం

- **పాస్ పోర్టు వెరిఫికేషన్ డేటా అంశంలో ఉత్తమ వ్యవస్థల్లో ఒకటిగా ఎపి**
- **రాష్ట్ర పోలీసు సంస్థాగత పనితీరు అవార్డుకు ఎపి ఎంపిక**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి యేటా మాదిరిగానే ఈఏడాది కూడా విదేశీ వ్యవహాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1967లో పాస్పోర్ట్ చట్టం అమలులోకి వచ్చిన రోజును గుర్తుచేసుకవడానికి. అదే సమయంలో పాస్‌పోర్ట్ అధికారుల సమావేశం కూడా నిర్వహించడం జరుగుతుందని ఇందులో పాస్‌పోర్ట్ సేవలకు సంబంధించిన రకరకాల విషయాలపై చర్చలు జరుగుతాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి మరియు చీఫ్ పాస్ పోర్టు అధికారి బివిఎస్ ముబారెక్ తెలియజేశారు. పాస్‌పోర్ట్ జారీలో పోలీసు వెరిఫికేషన్ ఎంతో కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ పోలీసు 2025-26 సంవత్సరానికి సంబంధించిన పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ డేటా ఆధారంగా దేశంలో అత్యుత్తమ పనితీరు చూపిన పోలీసు వ్యవస్థలలో ఒకటిగా గుర్తింపు పొందిందని తెలియజేశారు. అలగే “రాష్ట్ర పోలీసు సంస్థాగత పనితీరు అవార్డుకు కూడా ఎంపికైందని వెల్లడించారు. ఈ అవార్డును విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ జూన్ 19న సి.బి. ముత్తమ్మ హాల్, 'సి' వింగ్, జవహర్‌లాల్ నెహ్రూ భవన్ లో విదేశాంగ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలో అందజేస్తారని ఆయన డిజిపికి వ్రాసిన లేఖలో పేర్కొన్నారు.

జూన్ 19, 2026న జరిగే పాస్‌పోర్ట్ సేవా దివస్ మరియు పాస్‌పోర్ట్ అధికారుల సమావేశంలోని హై-లెవల్ సెషన్‌కు ఎపి డిజిపిని మనస్ఫూరిగా ఆహ్వానిస్తున్నట్టు ముబారక్ తెలిపారు. ఒకవేళ స్వయంగా రాలేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ తరఫున మరొక అధికారిని పంపవచ్చన్నారు.

మరిన్ని వివరాలకు, జెఎస్(పిఎస్పి) & సిపిఓ కార్యాలయంలోని సీనియర్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్‌ను సంప్రదచవచ్చని తెలియజేశారు. టెలిఫోన్ నంబరు: 011-23387013, మొబైల్: +91 9717740627, ఇమెయిల్: jscpo@mea.gov.in.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సన్మానం.

**-అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు**
**-కమిషనర్ మనోహర్**

**రాయికల్, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్)**విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా బుధవారం మేరు సంఘ భవనంలో నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, తడి-పొడి చెత్త వేరు చేసి సేకరణ, పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, ఇంకుడు గుంతల ఏర్పాటు, మహిళల భద్రత, అరైవ్--ఎలైవ్ కార్యక్రమం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. వార్డులోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించిన కమిషనర్, ఇందిరమ్మ ఇండ్లు మరియు నూతన పెన్షన్ పథకాల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం 10వ వార్డు కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించి కాలేజీ బ్యాగులను అందజేశారు. అలాగే 10 మంది చిన్నారులకు పలకలు, వాటర్ బాటిళ్లు, స్లేట్ పెన్సిల్ బాక్సులు పంపిణీ చేసి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ, విద్యార్థులు మరియు యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యే ప్రధాన మార్గమని, ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చేలా విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీయడానికి వారు ఆసక్తి ఉన్న రంగాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు హరీష్, సుష్మ, వార్డు అధికారి ప్రత్యూష, నాయకులు మచ్చ



శేఖర్, బాపురపు నరసయ్య, రాజీవ్, లింగంపల్లి సుభాష్, కాశవేణి రాజేష్, రాంప్రసాద్, గంగారెడ్డి, మల్లేష్, మెప్మా ఆర్పీలు సుజాత, అనూష, శ్యామల, అంగన్వాడీ ఉపాధ్యాయులు ఉమా, పుష్పలత, ఏఎన్ఎం ఫాతిమా, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసుపై కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలి

**-ఏఐటీయూసీ నాయకుడు కొరిమి రాజ్‌కుమార్**





**రామ్ మందిర్ ఏరియా, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ అనుబంధ సంఘం సమ్మె నోటీసు ఇవ్వడం నేపథ్యంలో యాజమాన్యం వెంటనే స్పందించి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్క్లబ్లు లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, వేతనాలు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితుల మెరుగుదల వంటి అంశాలపై అనేకసార్లు దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు చేపట్టలేదన్నారు. సమ్మె నోటీసు గడువు ముగిసేలోపు యాజమాన్యం చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే కార్మికులు చేపట్టే ఉద్యమాలకు పూర్తి మద్దతు ఉంటుందని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు ఈ సమావేశంలో ఏఐటీయూసీ, ఎస్సీడబ్ల్యూ యూ తదితర కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు

## సందర్భం లేని చీరల పంపిణీపై ప్రశ్నలు

**-ఎమ్మెల్యే తీరుపై వసంత సురేష్ విమర్శలు**



**రాయికల్, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎలాంటి పండుగలు, ప్రత్యేక సందర్భాలు లేకుం డానే ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టడం తెలంగాణ సంప్రదాయాలకు విరుద్ధమని మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వసంత సురేష్ విమర్శించారు. బుధవారం రాయికల్‌లో టీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జగిత్యాల పట్టణంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని మహిళలను ఆధార్ కార్డులతో పిలిపించి గంటల తరబడి వేచి ఉండేలా చేసి, చివరకు కార్యక్రమాన్ని రద్దు చేశారని ఆరోపించారు. మహిళలకు చీరలపై ఉన్న మమకారాన్ని ఆసరాగా చేసుకుని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. బతుకమ్మ చీరల పథకానికి పేరు మార్చి ఇందిరమ్మ చీరలుగా పంపిణీ చేస్తున్నారని, దీనిని మహిళలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఏ సంక్షేమ పథకమూ సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందన్నారు. ప్రజాసేవ పేరిట కాంట్రాక్టు పనులు చేసుకుంటూ, మధ్య మధ్యలో చీరల పంపిణీ కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు పొందేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో రాయికల్ పట్టణ, మండల అధ్యక్షులు ఎలిగేటి అనిల్‌కుమార్, బర్కం మల్లేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు మారంపెల్లి రాణి సాయికుమార్, ఉదయశ్రీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పరిశ్రమ బాధ్యతే-ఆర్జీ-1లో అవగాహన సదస్సు



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) పెద్దపల్లి మరియు కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో సింగరేణి ఆర్జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాల సురక్షిత నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఐసీ పెద్దపల్లి జనరల్ మేనేజర్ కీర్తికాంత్, కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ సైంటిస్ట్ కనకజ్యోతి, ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను పశ్రమలు అదనపు భారంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో సురక్షితంగా నిర్వహించడంతో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వనరులను సంరక్షిస్తూ వాటిని సమం ధ్వంతంగా వినియో గించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలి పా రు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పరిశ్రమ, ప్రతి వ్యక్తి భాగస్వామి కావాలని, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ వేణు, ఆర్జీ-3 ఏరియా ప్రతినిధులు, ఎన్ టిపి సి ఆర్ ఎఫ్ సి ఎల్ అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, రామగుండం మరియు పెద్దపల్లి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొ న్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు, వ్యర్థాల నిర్వహణలో అనుసరించాల్సిన జాగ్రత్తలు, ప్లాస్టిక్ కాలుష్య నివారణ చర్యలపై నిపుణులు పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు

## మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు




**రామ్ మందిర్ ఏరియా, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పై సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పందిస్తూ మంత్రి శ్రీధర్‌బాబు ప్రజాసేవకు అంకితమైన నాయకుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ మాట్లాడుతూ, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా ప్రజల విశ్వాసాన్ని పొందిన శ్రీధర్‌బాబు గురించి అవాస్తవాలు ప్రచారం చేయడం తగదన్నారు. వ్యక్తిగత ప్రచారం కోసం సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అసత్య ఆరోపణలు చేయడం బాధ్యత రాహిత్యమని విమర్శించారు. రామగుండం మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకులపై నిరాధార వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి ఇటువంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాల్వ లింగస్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులపై దుష్ప్రచారం చేసే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజా సేవలో విశేష కృషి చేసిన నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి చేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మంత్రి శ్రీధర్‌బాబుకు సంఘీభావం ప్రకటించారు

## అడ్లూరిపై విమర్శలు మానుకోవాలి: ఎమ్మార్పీఎస్




**జగిత్యాల, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ కుమార్‌పై మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేస్తున్న వ్యాఖ్యలను ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఖండించారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదని సూచించారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, కౌన్సిలర్ దుమాల రాజ్‌కుమార్ మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు మంత్రి పదవిలో ఉండడాన్ని కొందరు జీర్ణించు కోలే కపోతున్నారని ఆరోపించారు. అందుకే మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శిం చారు. మాది గల సామాజిక, రాజకీయ సాధికారత కోసం మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనపై చేస్తున్న నిరాధార ఆరోపణలను ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండి స్తోం దన్నారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ఉద్యమపరంగా తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరిం చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చేట్‌పల్లె లక్ష్మణ్, అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు భువనగిరి కిషన్, బొల్లె అనిల్, సోషల్ మీడియా ఇన్‌చార్జి నక్క సతీష్, చిర్ర లక్ష్మణ్, పొడేటి సునీల్, మారంపల్లి శంకర్, దాసరి సతీష కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం: డీసీపీ బి. రామ్ రెడ్డి



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) :** సమాజంలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని రామగుండం పోలీస్ కమిషనరేట్ డీసీపీ బి. రామ్ రెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డి-అడిక్షన్ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడిన డీసీపీ, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యులు కూడా బాధితులకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం సెంటర్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ప్రజలు నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి-అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు, వైద్య సిబ్బంది, పోలీసులు, సామాజిక కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గంజాయి నిర్మూలనతో పాటు మత్తు వ్యసనాల నివారణకు అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు

# విద్యాదాతకు విశిష్ట సన్మానం

- డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు ఘన సన్మానం



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : విద్యా, సామాజిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ వేలాది మందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖ విద్యావేత్త, పులిపాటి విద్యాసంస్థల అధినేత, ఖమ్మం పౌర సమితి అధ్యక్షులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ కి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెండోసారి నియమితులైన సందర్భంగా పులిపాటి నగర్-2లోని పులిపాటి మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. 2008లో భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా వాగ్దేవి విద్యా పురస్కారం అందుకున్న డాక్టర్ పులిపాటి ప్రసాద్, పులిపాటి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు విద్య, ఆర్థిక సహాయం, అన్నదాన సేవలు అందిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. సమాజంలో ఆపద్బాంధవుడిగా, విద్యాదాతగా ఆయన సాధించిన గుర్తింపు అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమర్నాథ్ లక్ష్మీనారాయణ నాయకత్వంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరిగి బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ప్రముఖులు, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ ని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్ధంశెట్టి శ్రీకాంత్, కోదుమూరు భద్రయ్య, కోదుమూరు జగన్నాథం, మాశెట్టి వరప్రసాద్, కొంకిమళ్ల మృత్యుంజయ గుప్తా, పాలవాయి వెంకటేశ్వర్లు, దాస శ్రీనివాసరావు, వజినేపల్లి చంద్రశేఖర్ గుప్తా, తేలుకుంట్ల ఓంకార్, వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, విద్యాల విశ్వనాథ్ గుప్తా, కాజా వెంకటేశ్వరరావు, సుగ్గల శ్రీహరి, గోపాలరావు, తాడికొండ అరవింద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ డాక్టర్ పులిపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

# పంట వ్యర్థాలను తగలబెడితే జరిమానా తప్పదు



నేలకొండపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) : పంట వ్యర్థాలను రైతులు పొలాలలో తగలబెడు తున్నారని అలా చేస్తే జరిమానా తప్పదని కొత్తకొత్తూరు సర్పంచ్ మాళోత్ కళావతీ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. కాదని తగలబెడితే ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న వ్యవసాయ సీజన్లో రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో అప్రమతంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు ఇంటి పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డు సభ్యులు గుగులోత్ వెంకటి, పాగర్తి శ్రీను, ఠాగూర్ రామ్సింగ్, పంచాయతీ కార్యదర్శి రవి, జీపీవో జానిమియా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా దేవాలయం వార్షికోత్సవం



నేలకొండపల్లి,జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : మండలం లోని మంగాపురంతండా లోని శ్రీ రామాలయ 15 వ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం లోని ఉత్సవమూర్తు విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. శ్రీరామ నామస్మరణంతో దేవాలయం మారుమోగింది. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైద్రాబాద్ కు చెందిన శ్రీ హరిహార నాట్యాలయం వారి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి. సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, రాజారాంపేట సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, గోబ్రియా నాయక్ తో పాటు రామాలయం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.



# పేదలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలి

: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, జూన్ 11(జర్నలిస్ట్ ఫైల్): పేదలకు వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా తమ వంతుగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలో గల వైరా రోడ్డు గల పాలెపు అక్కమ్మ ఎంక్లేవా లో స్కిన్ కేర్ హాస్పిటల్ ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరంతరం పేద బుడుగు బలహీన వర్గాలకు వైద్య అందుబాటులో ఉండే విధంగా తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ మేయర్ పునకొల్లు నీరజ, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, ఇతర తాజా మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు - మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సంక్షేమ పథకాలు అమలు- మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం- పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి- స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి- 3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రెన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ - జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు- మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి- ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలి - అనామలీ ఓటర్ల సమస్యలను పూర్తి ప్రక్రియ ద్వారా పరిష్కరించాలి- ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం,జూన్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10 లక్షల మంది వరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన 20 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని, బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారం సమర్పించని పక్షంలో వారి పేరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. అనంతరం అభ్యంతరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో అనామలీలను గణనీయంగా తగ్గించగలిగామని, గతంలో 30 శాతం ఉన్న అనామలీలను ప్రస్తుతం 20 శాతానికి తగ్గించామని తెలిపారు. 80 శాతం మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లలో సిస్టమ్ ద్వారా గుర్తించిన అనామలీలకు నోటీసులు జారీ చేసి పరిశీలన చేపడతామని చెప్పారు. తండ్రి-కొడుకు సంబంధంగా మ్యాపింగ్ చేసిన ఇద్దరి మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్నా, తాత-మనవడు సంబంధంగా నమోదు చేసిన వారి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్నా వాటిని అనామలీలుగా పరిగణించి నోటీసులు జారీ అవుతాయని తెలిపారు. అనామలీల సమస్య పరిష్కారానికి పూర్తి ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో గుర్తించిన లోపాలు గల ప్రతి అనామలీ ఓటరుకు నోటీసులు జారీ చేసి, వారి వివరణలు స్వీకరించి సవరణలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. మొత్తం ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఆధారాలతో భద్రపరుస్తామని తెలిపారు. అనామలీలుగా గుర్తించిన ఓటర్ల వద్ద సంబంధిత పత్రాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు జూలై 15 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. పాత ఎస్ఎస్ఆర్ జాబితాలో ఉండి మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని, రేషన్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణించబోమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్ల ప్రస్తుత స్థితి, గ్రామంలోనే నివసిస్తున్నారా, జీవించి ఉన్నారా లేదా, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా వంటి వివరాలను సేకరిస్తామని తెలిపారు. జనన తేదీలను కూడా పరిశీలిస్తామని చెప్పారు. జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రిలో ఎవరి అయినా ఒకరి జనన లేదా గుర్తింపు పత్రం సమర్పించాలని తెలిపారు. డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి ఫారాలతో పాటుగుర్తింపు పత్రాలు కూడా సేకరిస్తారని, అనామలీ ఓటర్ల సమస్యలను అవసరమైన పత్రాల ఆధారంగా పరిష్కరిస్తామని చెప్పారు. జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తమ పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్‌వో వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, రమేష్, పి. నాగరాజు, బీజేపీ ప్రతినిధులు రాజేష్, వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలరావు, సత్యనారాయణ, సిపిఎం డి.తిరుపతి, ఎస్.వీరబాబు, ఆప్ ప్రతినిధి పి.శ్రీనివాస్, టీడీపీ పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, బిఎస్పి సిహెచ్ నాగేశ్వర రావు, ఎం.నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరువైంది

ప్రధానమంత్రి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు

: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు



హైదరాబాద్, జూన్ 11 : దేశాభివృద్ధి, ప్రజాసేవ, సుశాసనానికి ప్రతీకగా నిలిచిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వం భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ . రాంచందర్ రావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సుదీర్ఘ ఆయురారోగ్యాలు, నిరంతర ప్రజాసేవ కోసం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ప్రార్థించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించిందన్నారు. ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విప్లవం, జాతీయ భద్రత, సంక్షేమ పథకాల అమలు వంటి రంగాల్లో భారత్ కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల మధ్య భారతదేశ ప్రతిష్ఠను పెంచడంలో మోదీ గారి పాత్ర అత్యంత కీలకమైందని ఆయన అన్నారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత త్రివర్ణ పతాక గౌరవం మరింత ఎత్తుకు చేరడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. వికసిత భారత్-2047 లక్ష్య సాధనకు మోదీ గారి దూరదృష్టి, పరిపాలనా సామర్థ్యం, అంకితభావం దేశ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని రామచంద్రరావు పేర్కొన్నారు. దేశం స్వావలంబన, సాంకేతిక ప్రగతి, పారిశ్రామికాభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుదీర్ఘ ప్రజాసేవ కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశ అభ్యున్నతి కోసం మోదీ గారి నాయకత్వం మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. బలమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన, సమర్థవంతమైన భారత నిర్మాణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని బీజేపీ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఖమ్మం లో విజేత సూపర్ మార్కెట్ ప్రారంభం




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం మమత రోడ్ లో విజేత సూపర్ మార్కెట్ ను బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. 1999 లో సూపర్ మార్కెట్ రంగంలో మొదటి బ్రాంచ్ స్థాపించి, నేడు "విజేత సూపర్ మార్కెట్ " ఒక బ్రాండుగా నిలిచిందని తుమ్మల కొనియాడారు.

27 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వినియోగ దారులకి, నిత్యావసర వస్తువులతో అత్యున్నతమైన నాణ్యమైన సేవలు అందించిన విజేత ఇప్పుడు మన ఖమ్మం లో 117వ శాఖ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు.

ఈ అవకాశాన్ని కస్టమర్లు వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. విజేత సూపర్ మార్కెట్స్ ఛైర్మెన్ మురకొండ జగన్మోహన్ రావు మాట్లాడుతూ తమను నమ్మిన మా కస్టమర్ లకు, ఖాతాదారులకు, అండగా నిలిచినా డిస్ట్రిబ్యూటర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలుగా మా ప్రయాణం లో నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన నా కుటుంబ సభ్యులకు, ఉద్యోగ సహచరులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

ప్రతి జిల్లా కేంద్రంలో మార్ట్ విస్తరిస్తామని, కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందిస్తామని జగన్ మోహన్ రావు అన్నారు.

ఈ సహకారం ఎప్పటికి కోరుతూ మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అండగా ఉండాలని విజేత సూపర్ మార్కెట్ చైర్మన్ కోరారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, రాజ్యలక్ష్మి,మార్కెటింగ్ డైరెక్టర్ సిధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ తిరుమలలో మంత్రి కొండపల్లి కాలినడక యాత్ర



- కూటమి రెండేళ్ల పాలనకు స్వామి వారి ఆశీస్సులు

**విజయనగరం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాభివృద్ధికి, కూటమి ప్రభుత్వానికి తిరుమల స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఏపీలో కూటమి పాలన విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అలిపిరి మెట్లమార్గం ద్వారా తిరుమల శ్రీవారి దర్శనానికి బయలు దేరారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్లలో శ్రీవారి ఆశీస్సులతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని... రాష్ట్ర ప్రజల శ్రేయస్సును, రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ కాలినడక యాత్ర చేస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి రెండేళ్ల పాటు మద్దతుగా నిలిచిన రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా ఆయనకు మరింత శక్తి ఇవ్వాలని శ్రీవారిని కోరుకుంటానని మంత్రి తెలిపారు. భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళతామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో పారదర్శకత పెంపు




- ఎటువంటి లోపాలు లేని తుది ఓటర్ల జాబితా లక్ష్యం: కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఓటర్ల జాబితాలో ఎటువంటి లోపాలు, దొంగ ఓట్లు లేకుండా సమగ్రమైన, పారదర్శకమైన తుది జాబితా రూపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) శిక్షణలో ఆయన పాల్గొన్నారు. జూన్ 5 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలిస్తారని, జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, సెప్టెంబర్ 22న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు.

బీఎల్‌ఓలు సేకరించే వివరాల్లో డబుల్ ఓట్లు, మరణించిన వారు, వలస వెళ్లిన వారి పేర్లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు పాటించాలని, రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయంతో పనిచేయాలని అన్నారు. శిక్షణలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో మంజూరైన ఎల్ఓసి చెక్కుల పంపిణీ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కులను పట్టణ పార్టీ నాయకులు పంపిణీ చేశారు.

మంగళగిరి పార్క్ రోడ్‌లో కమతం సుభాషిణి కి రూ. 1,84,891 లు, టిప్పర్ల బజార్ కు చెందిన షేక్ సాజిదా బేగం కు రూ. 1,62,062 ల విలువైన ఎల్వోసీ మంజూరు పత్రాలను అందజేశారు, ఈ కార్యక్రమం లో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 31 వ వార్డు అధ్యక్షులు షేక్ కరిముల్లా, గుంటూరు జిల్లా మైనార్టీ సెల్ సెక్రెటరీ షేక్ ఫిరోజ్ (ఖాదర్ వలీ), మంగళగిరి పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ షమీరా, 29 వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు బేతాళ కాంతారావు, ఆలీ(RMP), షేక్ షబ్బీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నలుగురికి కారుణ్య నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కారుణ్య నియామకం కింద నలుగురి కి ఉద్యోగ నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ గురువారం వారి చాంబర్‌లో అందజేశారు.

ఇద్దరిని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా, మరో ఇద్దరిని జూనియర్ అసిస్టెంట్‌గా ఆడిట్, వైద్య ఆరోగ్య శాఖలో నియమిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విధులను అంకితభావంతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఖాజావలి పాల్గొన్నారు.

## మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం

- ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ
- యాగశాల, గంట మండపం పునర్నిర్మాణానికి నిర్ణయం
- జులై 3న ఆలయ జీర్ణోద్ధరణ పనులకు శంకుస్థాపన
- ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష



**ఉండవల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి దిగువ సన్నిధిలోని ప్రసిద్ధ వైష్ణవ దివ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉండవల్లి నివాసంలో అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ ప్రతిపాదనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి లోకేష్ కు వివరించారు. ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంట మండపం పునర్ నిర్మాణం, వాహనశాల నూతన నిర్మాణానికి సమావేశంలో మంత్రి ఆమోదం తెలిపారు. ఆయా జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఆలయం వెలుపల చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపైనా మంత్రి లోకేష్ పలు సూచనలు చేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసే అవకాశం జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, భక్తులు సంతృప్తి చెందేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రూ. 6 కోట్ల వ్యయంతో మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పలు జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. జులై 3వ తేదీన ఆయా పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దాతల నుంచి విరాళాలా సేకరణపైనా సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఎండోమెంట్ చీఫ్ ఇంజనీర్ జి. శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మోహన్, వాస్తుశిల్పి పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగ కార్యక్రమానికి ఏర్పాట్లు షురూ

- అమరావతి పెరేడ్ గ్రౌండ్స్‌లో జూన్ 21న రాష్ట్ర స్థాయి యోగ కార్యక్రమం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి పెరేడ్ గ్రౌండ్స్‌లో జూన్ 21న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగ కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ జిల్లా ఎస్ పి వకుల్ జిందాల్ తో కలసి గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అమరావతి పెరేడ్ గ్రౌండ్స్‌కు దాదాపు 13 వేల మంది ప్రజలు, యోగ సాధకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముందస్తు ఏర్పాట్లకు ప్రణాళిక రచించుకొని అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన వేదిక ముందు భాగంలో 25 కంపార్ట్మెంట్లు ఏర్పాటు చేయాలని ఒక్కో కంపార్ట్మెంట్లో 50 మంది యోగ సాధకులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కంపార్ట్మెంటుకు ఎంపీడీవో స్థాయి అధికారి ఇన్చార్జిగా, వైద్య, పారిశుధ్య, పంచాయతీ శాఖల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక టీంను నియమించాలన్నారు. అదేవిధంగా దాదాపు 300 బస్సులు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని, పార్కింగ్ ప్రదేశాలను సులువుగా గుర్తించే విధంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పెరేడ్ గ్రౌండ్ పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు మున్సిపల్ కమీషనర్ కె. మయూర్ అశోక్, ఆర్డిఓ శ్రీనివాసరావు, పోలీసు, వైద్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై నియోజకవర్గ స్థాయి శిక్షణ

- ఓటరు జాబితా సవరణకు క్షేత్రస్థాయిలో సమన్వయం అవసరం
- అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలి
- మంగళగిరిలో నియోజకవర్గ స్థాయి శిక్షణ సమావేశం



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో క్షేత్రస్థాయి ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళగిరి నియోజకవర్గ స్థాయి శిక్షణా తరగతి గురువారం మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణంలోని భావనాఋషి కళ్యాణ మండపంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పోలింగ్ కేంద్రాల ప్రతినిధులు, విభాగాల బాధ్యులు, పట్టణ, మండల కమిటీ నాయకులు, గ్రామ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రాముఖ్యత, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణలు, తొలగింపులు, చిరునామా మార్పులు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల వివరాల్లో ఉన్న పొరపాట్లను గుర్తించి సరిదిద్దాలని సూచించారు. అలాగే ప్రజలకు ఓటరు నమోదు, సవరణల ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన దరఖాస్తులను సకాలంలో సమర్పించేలా సహకరించాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో, తప్పులులేని విధంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నాయకులు సూచించారు.

## యోగాంధ్ర 2026లో భాగంగా గుంటూరులో యోగాసనాల పోటీలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నగర ప్రజల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'యోగాంధ్ర 2026' కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాల పోటీలు ప్రారంభమయ్యాయి. గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో 10 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాల బాలికలకు యోగాసనాల పోటీలు నిర్వహించినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.

ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేస్తూ యోగాంధ్ర కార్యక్రమాలను ఉత్సాహభరితంగా నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. యోగాసనాలతో పాటు యోగా ప్రాముఖ్యతను తెలియజేసేలా చిత్రలేఖనం, నినాదాల రచన, పాటల పోటీలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయుష్ విభాగం నుంచి మాస్టర్ ట్రైనర్లు, జీఎంసీ కోఆర్డినేటర్ సింహాచలం ఆధ్వర్యంలో పోటీలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 12న 19 నుంచి 35 ఏళ్ల వయస్సు వారితో పాటు 36 ఏళ్లు పైబడిన వారికి కూడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు యోగాంధ్ర 2026 సచివాలయ స్థాయి పోటీల్లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

## గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో తొలిసారి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

- వైద్య బృందాన్ని అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలకు మరో ముందడుగు: మంత్రి సత్యకుమార్





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ వైద్య సేవల్లో మరో కీలక ముందడుగు పడింది. సాధారణంగా కార్పొరేట్, పెద్ద ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక మోకాలి మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్) శస్త్రచికిత్సను గజపతినగరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి స్థాయిలో ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం కావడంపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేసి, వైద్య బృందాన్ని అభినందించారు.

గత పదేళ్లుగా తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ నడవలేని స్థితికి చేరుకున్న 70 ఏళ్ల వృద్ధుడికి వైద్యులు ఈ శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అయ్యే భారీ ఖర్చును భరించలేని పరిస్థితిలో ఉన్న రోగికి గజపతినగరం ఏరియా ఆసుపత్రి వైద్యులు ముందుకు వచ్చి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ జగదీష్ పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ బెజవాడ సతీష్ కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. అనస్థీషియా వైద్యులు డాక్టర్ సాయికుమార్, డాక్టర్ దివ్య కీలక సహకారం అందించారు.

శస్త్రచికిత్సకు అవసరమైన కృత్రిమ కీళ్ల ఇంప్లాంట్ ఖర్చును మాత్రమే రోగి భరించగా, శస్త్రచికిత్స నిర్వహణ, ఆపరేషన్ థియేటర్, మందులు, ఇతర వైద్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలను మరింత విస్తరించడమే లక్ష్యమని వైద్యులు తెలిపారు.

పేద రోగులకు పూర్తిగా ఉచితంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని వైద్యులు కోరారు. ఇంప్లాంట్ల ఖర్చును భరించేందుకు సహకారం అందిస్తే ఆర్థికంగా వెనుకబడిన వారికి మరింత మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు.

## ఎమ్మెల్యే నసీర్‌కు ఘన స్వాగతం



- హజ్ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చిన ఎమ్మెల్యే నసీర్
- శంషాబాద్ ఎయిర్ పోర్టులో కలిసిన గుంటూరు తూర్పు నియోజకవర్గ నేతలు
- ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** పవిత్ర హజ్ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ కు గురువారం రాత్రి హైదరాబాద్లోని శంషాబాద్ విమానాశ్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ మైనారిటీ నాయకులు, కూటమి నేతలు కలిసి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఎమ్మెల్యే నసీర్ కు వివరించారు. పవిత్రమైన హజ్ యాత్ర పూర్తి చేసుకోవడం అల్లాహ్ కృపగా భావిస్తున్నానని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించానన్నారు. సీఎం మార్గదర్శకత్వంలో ఆంధ్ర రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లే హాజీలకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అందిస్తోన్న సహకారం చాలా బాగుందని చెప్పారు. హాజీలు ఈ ఏడాది గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి వెళ్లే విధంగా ఏర్పాటు చేసిన విషయాన్ని సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ చాలా ఆధ్యాత్మికంగా సంతోషకరంగా హజ్ యాత్రను పూర్తి చేసుకున్నారని తెలిపారు.

## చంద్రబాబు తిరుపతి సభను విజయవంతం చేయాలి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ పిలుపు



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలో 'నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం' విజయోత్సవ సమీక్షా సమావేశం లో సత్యవేడు నియోజకవర్గ సభ ఇన్చార్జిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని దిశానిర్దేశం చేశారు.

జీవీ మాట్లాడుతూ, తిరుపతిలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే భారీ బహిరంగ సభను నియోజకవర్గ ప్రజలు, కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి క్లినిక్ లను తనిఖీ చేసిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని పలు ఆర్.ఎం.పి క్లినిక్ లను గురువారం బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మల్లేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

జిల్లాలోని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ లందరూ ఈరోజు ఆర్ఎంపీ క్లినిక్ లను పరిశీలించి, ప్రభుత్వం అందించిన చెక్ లిస్ట్ ప్రకారం మానిటరింగ్ చేస్తున్నామని అందులో భాగంగానే ఈరోజు వనిపెంటలో ముగించుకొని ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

ఇప్పటివరకు 12 క్లినిక్ లను పరిశీలించామని, ప్రభుత్వం చెప్పినట్లుగా ఆర్ఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దని అలాగే నేమ్ బోర్డు కు కూడా ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే పెట్టుకోవాలని ఆర్ఎంపీలకు సూచించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి. మఠం పీ. హెచ్ సి మెడికల్ ఆఫీసర్ సంపత్ కుమార్ హెల్త్ అసిస్టెంట్ మాధవ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## విద్యుత్ బస్సుల ప్రైవేటీకరణను నిలిపివేయాలి



○ ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకుని, టెండర్లను రద్దు చేసి ఆర్టీసీ ద్వారానే బస్సులను కొనుగోలు చేసి నిర్వహించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను భర్తీ చేయాలని, వెంటనే 4 వేల కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని కోరింది.

ప్రైవేట్ ఆపరేటర్లకు విద్యుత్ బస్సులతో పాటు డిపో స్థలాలను అప్పగించే చర్యలు ఆర్టీసీ ప్రైవేటీకరణకు దారితీస్తాయని జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. విద్యుత్ బస్సుల టెండర్లను రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాలకు, రవాణా శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినట్లు వెల్లడించారు. విద్యుత్ బస్సుల కోసం ఖాళీ చేయించిన విజయవాడ విద్యాధరపురం, నెల్లూరు-2, గుంటూరు-2 డిపోలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే దశలవారీ ఉద్యమాలు చేపడతామని జేఏసీ హెచ్చరించింది. ఈ నెల 16 నుంచి 20 వరకు విజయనగరం, విజయవాడ, నెల్లూరు, తిరుపతి, అనంతపురంలో ఉద్యమ సన్నాహక సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూన్ 23, 24 తేదీల్లో అన్ని డిపోలు, యూనిట్లలో ఎర్ర రిబ్బన్లు ధరించి గేట్ మీటింగ్‌లు, ధర్నాలు నిర్వహిస్తామని, భవిష్యత్ కార్యాచరణపై జూన్ 28న విజయవాడలో సమావేశం నిర్వహిస్తామని ప్రకటించింది.

## బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

○ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఎండోమెంట్స్ శాఖ పరిధిలోకి మార్చడంపై బీజేపీ హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** బ్రాహ్మణ సంక్షేమం, అర్చకుల అభ్యున్నతి, ధార్మిక వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తెలిపారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఈడబ్ల్యూఎస్ శాఖ పరిధి నుంచి ఎండోమెంట్స్ శాఖ పరిధిలోకి తీసుకురావడం కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదని, బ్రాహ్మణ సమాజ అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా అర్చకులు, వేద పండితులు, బ్రాహ్మణ కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధార్మిక విలువల పట్ల ఉన్న నిబద్ధత, మంత్రి లోకేష్ చొరవ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మార్గదర్శనం వల్లే ఈ నిర్ణయం సాధ్యమైందని గంగాధర్ పేర్కొన్నారు.

ఎన్నో సంవత్సరాలుగా బ్రాహ్మణ సమాజం ఎదురుచూస్తున్న అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం ఆనందకరమన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం, అర్చకుల అభివృద్ధి, దేవాలయ వ్యవస్థ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైందని తెలిపారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ కృషి, నాయకత్వంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సమాజ సంక్షేమానికి మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి అవసరమైన మరిన్ని కార్యక్రమాలు చేపడతారనే నమ్మకం ఉందన్నారు.

ఈ సందర్భంగా నిర్ణయానికి సహకరించిన ప్రభుత్వ పెద్దలకు, నాయకులకు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్..

### ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లకు 'ఫ్రీ ఎంట్రీ'




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులకు, ముఖ్యంగా విద్యార్థులకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సరికొత్త కానుకను అందించింది. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన 'ఆంధ్రా ప్రీమియర్ లీగ్' (ఏపీఎల్ 2026) సీజన్ మ్యాచ్‌లను నేరుగా మైదానంలో చూసేందుకు అభిమానులకు, విద్యార్థులకు, ప్రజలకు ఉచిత ప్రవేశాన్ని కల్పించారు. లీగ్‌కు మరింత ఆదరణ పెంచడంతో పాటు స్థానిక వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**మూడు నగరాల్లో క్రికెట్ సందడి :** గత సీజన్లలా కాకుండా ఈసారి ఏపీఎల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తూ మూడు వేర్వేరు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాలలో మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం వేదికగా జూన్ 9 నుండి జూన్ 13 వరకు తొలి దశ మ్యాచ్‌లు. వైఎస్ఆర్ కడప జిల్లా స్టేడియంలో జూన్ 17 నుంచి జూన్ 21 వరకు రెండో దశ మ్యాచ్‌లు, మంగళగిరి అంతర్జాతీయ స్టేడియం (గుంటూరు)లో జూన్ 24 నుండి జూన్ 30 వరకు చివరి దశ మ్యాచ్‌లతో పాటు గ్రాండ్ ఫైనల్ ఇక్కడే నిర్వహించనున్నారు.

మొత్తం 7 ఫ్రాంచైజీ జట్లు తలపడుతున్న ఈ టోర్నమెంట్‌లో వేలాది మంది అభిమానులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తుండగా.. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమ ఐడీ కార్డులు చూపిస్తే, ప్రత్యేక పాస్‌ల ద్వారా స్టేడియంలోకి నేరుగా ఉచిత ప్రవేశం పొందే వీలు కల్పించారు. కడప, మంగళగిరి స్టేడియాల్లో కొత్తగా ఫ్లడ్‌లైట్లను కూడా ఏర్పాటు చేసి డే-నైట్ మ్యాచ్‌లుగా అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఈ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడలేని వారి కోసం 'జియో సినిమా' యాప్, 'స్టార్ స్పోర్ట్స్' నెట్‌వర్క్‌లలో లైవ్ ప్రసారాలు అందుబాటులో ఉన్నాయి.

# కూటమి ప్రభుత్వంలో కళలకు, కళాకారులకు అత్యున్నత గౌరవం : మంత్రి దుర్గేష్

○ రాజమహేంద్రవరంలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ సంగీత-నృత్య మహోత్సవం "కళా సమ్మేళన్ -- 2026"లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

○ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఉత్తరాంధ్రలోని గురజాడ స్మారక చిహ్నం పునరుద్ధరణకు రూ.1.20 కోట్లు: మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వంలో కళలకు, కళాకారులకు అత్యున్నత గౌరవం ఇస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలోని గౌతమీ ఘాట్ రోడ్డు నందు గల ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో శ్రీ రాధాకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్ర భారత్ వార్షీయ యువ సేవ సంస్థ జూన్ 11 నుండి 14 వరకు నిర్వహిస్తోన్న "కళా సమ్మేళన్ -- 2026" అంతర్జాతీయ సంగీత--నృత్య మహోత్సవంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మంత్రి గారు ప్రాంగణంలో ధ్వజస్తంభాన్ని మొక్కి, అనంతరం మహాగణపతి, నటరాజ స్వామి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మంత్రి దుర్గేష్‌ని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "కళా సమ్మేళన్ -- 2026" అత్యంత అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళలకు, సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశం మేరకు ప్రతి సంవత్సరం కందుకూరి పురస్కారాలు, ఉగాది పురస్కారాలు, కళారత్న పురస్కారాలను నిరంతరాయంగా అందజేస్తున్నామని, ఎందరో లబ్ధప్రతిష్టులైన కళాకారులను ఈ అవార్డులతో సత్కరించుకున్నామని గుర్తుచేశారు. సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన గుర్రం జాషువా, బోయి భీమన్నల పురస్కారాల ప్రదానం చేశామన్నారు. అంతేగాక వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి జయంతి సందర్భంగా 'తెలుగు భాషా దినోత్సవం నిర్వహించి తెలుగు భాషా పురస్కారాలు ప్రదానం చేశామన్నారు.. ఇలా ఏ ఒక్కరినీ విస్మరించకుండా సాంస్కృతిక పునరుజ్జీవనమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ప్రముఖుల జయంతులు, వర్ధంతులను ఘనంగా నిర్వహించడం ద్వారా వారి ఆదర్శాలను, ఆశయాలను భావితరాలకు అందించి స్ఫూర్తి రగిలిస్తున్నామని పేర్కొన్నారు.

"దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అని చాటిచెప్పిన ప్రముఖ యుగకర్త, మహాకవి గురజాడ అప్పారావు గారి ఉత్తరాంధ్రలోని ఇల్లు శిథిలావస్థకు చేరడంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రత్యేకంగా స్పందించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ క్రమంలో రూ. 1 కోటి 20 లక్షల నిధులతో ఆ ఇంటిని అద్భుతంగా బాగు చేయించి గురజాడ స్మారక చిహ్నంగా నిలబెట్టేందుకు చర్యలు తీసుకున్నామని, ఇది ఎందరికో ఆదర్శనీయమని స్పష్టం చేశారు. గొప్ప గొప్ప మహనీయులను, ప్రతిభావంతులను అందించిన చారిత్రక నగరమైన రాజమహేంద్రవరంలో డా. నారాయణ చేపడుతున్న ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆనందదాయకమని మంత్రి ప్రశంసించారు. శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం కలకాలం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం తమ అద్భుతమైన ప్రదర్శనలతో అలరించిన చిన్నారులను, యువ కళాకారులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించి ఆశీస్సులు అందజేశారు.

# మోడల్ ప్రాథమిక పాఠశాలలను కనీసం మూడు సంవత్సరాలు హేతుబద్ధీకరణ లేకుండా కొనసాగించాలి

○ నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థుల నమోదు పెంపు, నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడం, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని అందుబాటులో ఉంచడం వంటి లక్ష్యాలతో మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అయితే మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ఒక కొత్త విద్యా సంస్కరణ కావడంతో తల్లిదండ్రులు, గ్రామీణ ప్రజల్లో పూర్తి అవగాహన ఏర్పడటానికి కొంత సమయం అవసరమని తెలిపారు. కొత్త విధానాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి మరియు విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయికి చేరుకోవడానికి కనీసం కొన్ని సంవత్సరాలు పడుతుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం నమోదును మాత్రమే ప్రాతిపదికగా తీసుకొని మోడల్ ప్రాథమిక పాఠశాలలను తిరిగి బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చడం లేదా హేతుబద్ధీకరణ చేయడం జరిగితే, ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు నెరవేరకపోవడమే కాకుండా విద్యార్థులు నాణ్యమైన విద్యా అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల తల్లిదండ్రుల్లో కూడా అనిశ్చితి ఏర్పడి భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అందువల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలలను కనీసం మూడు విద్యా సంవత్సరాల పాటు హేతుబద్ధీకరణ లేదా డౌన్‌గ్రేడేషన్ లేకుండా కొనసాగిస్తూ, అవసరమైన ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలను కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి మోడల్ ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు స్థిరత్వాన్ని కల్పించాలని సంఘం నాయకులు కోరారు.

# 419 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

○ 110 మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్, ఫార్మసిస్టుల పోస్టులకు కూడా..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ ఆరోగ్య మిషన్ కింద స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ల కేటగిరిల్లో కలిపి 529 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూటుమెంటు బోర్డు నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో 419 స్టాఫ్ నర్సులు, 24 ఫార్మసిస్టు పోస్టులు, 86 మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ పోస్టులు ఉన్నాయి. ఒప్పంద విధానంలో భర్తీ చేయనున్న ఈ పోస్టుల నోటిఫికేషన్ అనుసరించి అర్హత కలిగిన వారు ఈ నెల 13 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని బోర్డు తెలిపింది. జూన్ 30 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ. 419 స్టాఫ్ నర్సుల పోస్టులు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లో ఎన్సీడీ క్లినిక్ లు, న్యూట్రిషన్ రికవరీ సెంటర్లు, నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లు, ఇతర విభాగాల్లో ఉన్నాయి. బీఎస్సీ నర్సింగ్ లేదా జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ కోర్సు పూర్తిచేసి ఉండాలి. స్టాఫ్ నర్సులకు నెలసరి వేతనం:27,675. డి-ఫార్మసీ/బి-ఫార్మసీ/ఇంటర్ వొకేషన్ కోర్సును ఫార్మసీలో పూర్తిచేసిన వారు ఫార్మసిస్ట్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలి. వీరికి నెలసరి వేతనం:23,393. మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ పోస్టుల కోసం దరఖాస్తుచేసే వారు ఇంటర్ తోపాటు ఒకటిన్నర సంవత్సరం వ్యవధి కలిగిన మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. నెలసరి వేతనం:23,494. ఈ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ( హెచ్‌టిటిపిఎస్:// ఎపిఎంఎస్ఆర్‌బి. ఎపి.జిఓవి.ఇన్ /ఎంఎస్ఆర్‌బి/) లో పూర్తి సమాచారం ఉంది. ఈ పోస్టులన్నింటికీ కలిపి 15వేలకుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. వీటి పరిశీలన నుంచి ఎంపిక జాబితా ఖరారు ఎపి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా జరుగుతుంది. ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి ఈ ప్రక్రియ జరుగుతుంది. స్టాఫ్ నర్సుల పోస్టులను జోన్‌ల వారీగా, ఇతర పోస్టులను జిల్లాల స్థాయిల్లో భర్తీ చేస్తారు.

**267 కొత్త మెడికల్ ఆఫీసర్లకు శుక్రవారం పోస్టింగ్ ఉత్తర్వులు: మంత్రి సత్యకుమార్ :** జీరో వేకన్సీ విధానం అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ కింద 529 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్ అనుసరించి జాతీయ ఆరోగ్య మిషన్ కింద 6 కేటగిరీలలో కలిపి 267 మెడికల్ ఆఫీసర్ల భర్తీకి సంబంధించి పోస్టింగ్ ఉత్తర్వులను శుక్రవారం పంపబోతున్నామని తెలిపారు.

ముగిసిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు అనుసరించి పోస్టింగు ఉత్తర్వులు ఆటోమేటిగ్గా అభ్యర్థులకు మెయిళ్ల ద్వారా వెళ్తాయని తెలిపారు. వీరు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సిహెచ్‌సి, ఏరియా, జిల్లా ఆసుపత్రులోని ఎన్సీడీ క్లినిక్కులు, నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లుగా విధుల్లో చేరనున్నారు.

# బీజేపీ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి






○ బీజేపీ ప్రశిక్షణ కార్యక్రమాలపై సమీక్ష

○ కార్యకర్తల నిర్మాణం, పార్టీ సిద్ధాంతాల విస్తరణకు ప్రాధాన్యం

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026లో భాగంగా జిల్లాల వారీగా జరుగుతున్న ప్రశిక్షణ వర్గాల పురోగతిపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాల్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ బలోపేతానికి సమర్థవంతమైన కార్యకర్తల నిర్మాణం కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, జాతీయ భావజాలాన్ని ప్రతి కార్యకర్తకు చేరేలా ప్రశిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేలా శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

ప్రశిక్షణ ద్వారా కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ మాట్లాడుతూ, పార్టీ విస్తరణకు కార్యకర్తలే ప్రధాన బలమని అన్నారు.

నియోజకవర్గాలు, మండలాలు, గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగేందుకు శిక్షణ పొందిన కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధతతో పనిచేసే కార్యకర్తల ద్వారానే పార్టీ లక్ష్యాలను సాధించగలమని తెలిపారు.

సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు లక్ష్మీ ప్రసన్న, మట్టా ప్రసాద్, దయాకర్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, రాబోయే కార్యక్రమాలపై నాయకులు మార్గనిర్దేశం చేశారు.

## కాంట్రాక్టు అధ్యాపకులకు ఇంటర్వ్యూలు రద్దు చేయాలి



○ నల్లపల్లి విజయ్ భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జవహర్ లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సేవా పునరుద్ధరణ ప్రక్రియ కోసం మళ్లీ ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలనుకోవడం సరైన పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇంటర్వ్యూలు రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు నల్లపల్లి విజయ్ భాస్కర్ మద్దతు పలికారు. విశ్వవిద్యాలయ అధికారుల నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఎన్నో ఏళ్లుగా నమ్ముకుని, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వాములవుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న కాంట్రాక్టు అధ్యాపకులను మానసిక ఆందోళనకు గురిచేసేలా ఈ ఇంటర్వ్యూల నిర్ణయం ఉందన్నారు. కేవలం సేవా పునరుద్ధరణ కోసం ప్రతిసారీ ఇలాంటి నిబంధనలు పెట్టడం వల్ల అధ్యాపకులలో ఉద్యోగ భద్రతపై అభద్రతాభావం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సేవా పునరుద్ధరణ ప్రక్రియను పాత పద్ధతిలోనే, వారి గత పనితీరు ఆధారంగా సులభతరం చేయాలి తప్ప, కొత్తగా ఇంటర్వ్యూల పేరుతో ఇబ్బందులు పెట్టకూడదని అన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు విశ్వవిద్యాలయ అధికారులపై ఉందని అన్నారు. ఇప్పటికైనా జెఎన్టియు యాజమాన్యం మరియు ఉన్నతాధికారులు పునరాలోచించి, అధ్యాపకుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న ఈ ఇంటర్వ్యూల నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని నల్లపల్లి విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు.

## భవిష్యత్ వైద్య విధానాల్లో 'క్వాంటం బయాలజీ' కీలకం



○ వైద్య విద్యలో చేర్చేందుకు ఎన్ఎంసీకి ప్రతిపాదనలు పంపనున్న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** భవిష్యత్ వైద్య పరిశోధనలు, చికిత్సా విధానాల్లో 'క్వాంటం బయాలజీ' కీలక పాత్ర పోషించనుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ తెలిపారు. వైద్యం, రోగ నిర్ధారణ, బయోమెడికల్ పరిశోధనల్లో క్వాంటం బయాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అభివృద్ధి చెందుతున్న రంగమని పేర్కొన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "క్వాంటం బయాలజీ: అణువుల నుంచి వైద్యం వరకు" అనే వెబినార్‌లో ఆయన మాట్లాడుతూ క్వాంటం బయాలజీకి సంబంధించి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల రూపకల్పనపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల పాఠ్యాంశాల్లో క్వాంటం బయాలజీని చేర్చేలా జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)కు ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న వెబినార్‌లో పాల్గొని క్వాంటం సాంకేతికత ఆరోగ్య రంగంలో తీసుకురాగల మార్పులను వివరించారు. ప్రజారోగ్య వ్యవస్థల్లో క్వాంటం సైన్స్ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ ఆధునిక వైద్య రంగంలో క్వాంటం భౌతిక శాస్త్ర అనువర్తనాలపై వివరించారు.

ఐఐటీ ఢిల్లీ, ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ఆరత్ కల్రా రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని క్వాంటం బయాలజీలో తాజా పరిశోధనలు, వైద్య రంగంలో వాటి వినియోగంపై ప్రసంగించారు.

జీవ ప్రక్రియల్లో క్వాంటం దృగ్విషయాల పాత్రపై వైద్య నిపుణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పలు విభాగాల అధికారులు, వైద్య కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467